క్లుప్తంగా

ఏసీపీకి సత్కారం



జనగామ: జనగామ ఏసీపీగా విధులు నిర్వర్తిస్తూ బదిలీపై వెళ్తున్న దేవేందర్‌రెడ్డిని కాంగ్రెస్ మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు ఎండీ అజహరొద్దీన్ మంగళవారం సత్కరించారు. శాంతిభద్రతల విషయంలో ఏసీపీ సేవలను కొనియాడారు.

ఎస్సైలకు..



దేవరుప్పుల: మండలంలో ఎస్సైగా విధులు నిర్వర్తించిన కొంగరి శ్రవణ్‌కుమార్ బదిలీ అయ్యారు. ఈమేరకు మంగళవారం ఉస్మానియా జాక్ సభ్యులు ఇప్ప పృథ్వీరెడ్డి ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వడ్లకొండ ప్రశాంత్, చింతల రవీందర్ రెడ్డి, రాము నాయక్, విజయ్ పాల్గొన్నారు. అలాగే ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో హనుమకొండ నుంచి దేవరుప్పులకు వచ్చిన చెన్నకేశవులను కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నల్ల శ్రీరామ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి ఆహ్వానించారు. కాసారపు ధర్మారెడ్డి, తోటకూరి పాండు, గణేష్, యాకస్వామి, వెంకన్న,సత్యనారాయణ,వీరన్న పాల్గొన్నారు.

క్రీడాపోటీల పోస్టర్ ఆవిష్కరణ

జనగామ : జిల్లా కేంద్రంలో ఈనెల17వ తేదీన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినం పురస్కరించుకొని బతుకమ్మకుంటలో నిర్వహించ తలపెట్టిన నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల పోస్టర్‌ను మంగళవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆవిష్కరించారు. యూత్ ఫెస్టివల్ ఆధ్వర్యంలో ఈ నెల 15,16,17 తేదీల్లో వాలీబాల్ క్రీడా పోటీలను నిర్వహిస్తారన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

లంబాడీ గిరిజనుల ఆరాధ్యదైవం సేవాలాల్ మాహరాజ్ 285వ జయంతి ఉత్సవాల నిర్వహణ చైర్మన్‌గా వేడుకలకు హాజరు కావాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని నిర్వాహకులు మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వాంకుడోత్ అనిత, మాజీ ఎంపీటీసీ కాలురాం, భూక్యా చందు, కొర్ర రాజేందర్, కార్యక్రమ నిర్వాహణ జిల్లా అధికారులు వినోద్ కుమార్, వెంకన్న, ధర్మభిక్షం, బానోత్ రవి, బానోత్ రఘు తదితరులు ఉన్నారు.

కొవ్వొత్తులతో నివాళి



జనగామ: రాష్ట్రంలోని ఆయా జిల్లాలో ఇటీవల ఆత్మహత్యలకు పాల్పడిన విద్యార్థుల ఆత్మశాంతి కోరుతూ ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ఆర్టీసీ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో ర్యాలీ తీసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జిల్లా నాయకులు చిరంజీవి, ప్రశాంత్, రవి, రాజు, నవీన్ మాట్లాడుతూ భువనగిరిలో వైష్ణవి, భవ్య, సూర్యాపేట ఎస్సీ రెసిడెన్షియల్‌లో దగ్గుపాటి వైష్ణవి, నారాయణ ఐఐటీ అకాడమీలో వినయ్ ఆత్మహత్యలపై ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. ఆత్మహత్యలకు కారణమైన వారిపైన చర్యలు తీసుకోవాలన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం



జనగామ: ఉమ్మడి వరంగల్ జిల్లా మేడిగడ్డ పర్యటన నేపథ్యంలో హైదరాబాద్ నుంచి బయలు దేరిన సీఎం రేవంత్‌రెడ్డికి వరంగల్ –హైదరాబాద్ హైవే.. జనగామ మండలం పెంబర్తి కాకతీయ కళాతోరణం వద్ద మంగళవారం ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఆయనకు స్వాగతం పలికారు. వరంగల్ కమిషనర్(సీపీ) అంబర్ కిషోర్ ఝా బందోబస్తును పరిశీలించారు. మధ్యాహ్నం 12.23 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి కాన్వాయ్ జిల్లా సరిహద్దుకు చేరుకోగా అభిమానులు పెద్ద ఎత్తున స్వాగతం పలుకుతూ నినదించారు. నాయకులు వేమెళ్ల సత్యనారాయణరెడ్డి, చెంచారపు బుచ్చిరెడ్డి, తదితరులు ఉన్నారు.

టోల్ ప్లాజా వద్ద..

రఘునాథపల్లి: హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గాన మేడిగడ్డ సందర్శనకు వెళ్తున్న సీఎం రేవంత్‌రెడ్డి కాన్వాయ్‌కు మండలంలోని కోమళ్ల టోల్ ప్లాజా వద్ద కాంగ్రెస్ శ్రేణులు భారీ ఎత్తున స్వాగతం పలికారు.

బందోబస్తు పరిశీలన

చిల్పూరు: సీఎం రేవంత్ రెడ్డి మేడిగడ్డ పర్యటన నేపథ్యంలో చిన్నపెండ్యాల గ్రామ సమీపంలోని జాతీయ రహదారిలో ఏర్పాటు చేసిన పోలీసుల బందోబస్తును స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ సుందరగిరి శ్రీనివాస్‌రావు పరిశీలించారు. రఘునాథపల్లి సీఐ శ్రీనివాస్‌యాదవ్, ఎస్సై వినయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

‘ప్రాజెక్టులు తెచ్చింది మేమే’



జనగామ: జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ/తరిగొప్పుల/కొడకండ్ల/బచ్చన్నపేట/దేవరుప్పుల/పాలకుర్తి టౌన్ : తెలంగాణ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు బీఆర్ఎస్ గిరిగీసి కొట్లాడి ప్రాజెక్ట్ తెచ్చుకుంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం అప్పనంగా ఇచ్చేస్తుందని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కృష్ణా జలాల నిర్వహణ బాధ్యత కృష్ణ రివర్ మేనేజ్‌మెంట్ బోర్డ్‌కు అప్పగించడాన్ని నిరసిస్తూ వాటి పరిరక్షణ కోసం నల్లగొండలో బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు నాయకత్వంలో తలపెట్టిన బహిరంగ సభకు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో 4500 మంది తరలివెళ్లారు. అంతకు ముందు ఆయన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. నల్లగొండలో కేసీఆర్ నిరసన సభ అనగానే, భయపడ్డ సీఎం ప్రాజెక్టులను ఎవరికి అప్పజెప్పబోమని తీర్మానం చేసిన సంగతి ప్రజలు గమనిస్తున్నారన్నారు. కేంద్రం నుంచి తెలంగాణ సాగునీటి హక్కులను కాపాడుకునేందుకు బీఆర్ఎస్ నిత్యం ఉద్యమిస్తూనే ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు ఉన్నారు. అలాగే బచ్చన్నపేట, తరిగొప్పుల, కొడకండ్ల, దేవరుప్పుల, పాలకుర్తి మండలాల నుంచి ఇర్రి రమణారెడ్డి, పింగిళి జగన్మోహన్‌రెడ్డి, ఎంపీపీలు జ్యోతి, నాగిరెడ్డి, సిందె రామోజీ, పల్లా సుందర్‌రామిరెడ్డి, తీగల దయాకర్, పసునూరి నవీన్ ఆధ్వర్యంలో నాయకులు పలు వాహనాల్లో సభకు తరలి వెళ్లారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కడియం కావ్య

స్టేషన్‌ఘన్‌పూర్: క్రీడల్లో గెలుపు, ఓటమి సహజమని, ఆటగాళ్లు క్రీడాస్ఫూర్తితో వ్యవహరించాలని కడియం ఫౌండేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ కడియం కావ్య అన్నారు. మండలంలోని నమిలిగొండలో గ్రామ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో కడియం ఫౌండేషన్ సహకారంతో నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ క్రీడాపోటీలను ఆమె మంగళవారం సందర్శించారు. ఈ మేరకు ముందుగా ఆమె క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామీణ స్థాయి క్రీడలను ఆదరించాలని, ప్రో కబడ్డీ ద్వారా కబడ్డీకి విశేష ఆదరణ లభిస్తుందన్నారు. ఇలాంటి క్రీడాపోటీల ద్వారా గ్రామీణ ప్రాంత క్రీడాకారుల ప్రతిభ వెలుగులోకి వస్తుందన్నారు. క్రీడాపోటీల ద్వారా నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని, మానసిక, శారీరక ఆరోగ్యానికి దోహదపడుతుందన్నారు. నమిలిగొండలో ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడాపోటీలను నిర్వహించడం అభినందనీయమని, నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. క్రీడాపోటీలలో అందరూ క్రీడాస్ఫూర్తితో వ్యవహరించాలని, గెలుపు, ఓటమిలను సమానంగా స్వీకరించాలన్నారు. గ్రామీణ స్థాయి క్రీడలకు కడియం ఫౌండేషన్ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పురమాని రజాక్, మాజీ సర్పంచ్ డ్యాగల ఉప్పలస్వామి, ఆర్గనైజింగ్ సెక్రటరీ దిలీప్‌కుమార్, పీఈటీలు మారపాక రాజు, గజ్జెల్లి రాజు, యూత్ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని పూజలు



బచ్చన్నపేట: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి సీఎం కావాలని మండలంలోని కొడవటూర్‌లోని స్వయం భూ సిద్దేశ్వరాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు బొడ్డు ప్రవీణ్‌కుమార్ పూజలు చేశారు. మంగళవారం మోకాళ్లపై ఆలయం మెట్లు ఎక్కి సిద్దేశ్వరుడికి పూజలు చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. జగన్ ఏపీలో ప్రజల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రజల ఆశీర్వాదంతో మళ్లీ రెండో సారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి గెలవడం ఖాయమన్నారు. జగన్ మళ్లీ సీఎం కావాలని సంతకాల సేకరణకు విజయవాడకు వెళ్తున్నట్లు తెలిపారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



జనగామ రూరల్: వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

జనగామ రూరల్: ఈనెల 16 వతేదీన తలపెట్టిన దేశ వ్యాప్త బంద్‌ను అన్ని వర్గాల కార్మికులు జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి సుంచు విజేందర్ పిలునిచ్చారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చౌరస్తాలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. నాయకులు ఏ రాజు, ప్రశాంత్, మల్లేష్, మునీర్,శ్రీను, విజయ్,మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి

రఘునాథపల్లి: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని సీఐటీయూ మండల కన్వీనర్ పొదల నాగరాజు పిలుపు నిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఈ నెల 16న తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మె కరపత్రాలను ఆయన కార్మిక సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. సీఐటీయూ, ప్రజా సంఘాల నాయకులు భూక్య హరికిషన్, ముల్కపల్లి కృష్ణ, బండమీది నాగరాజు, ఎండీ యాకూబ్, గాదె రాజు, సికిందర్, సుధాకర్, సురేష్, రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తి: బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సోమసత్యం అన్నారు. ఈ మేరకు మంగళవారం బమ్మెర గ్రామంలో ఈ నెల 16న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మె కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. నాయకులు ఒగ్గుల లక్ష్మణ్, సోమ సాయి, ఎం. అశోక్, ఎం. రజిత, ఎం. ప్రశాంత్, సిహెచ్ యాదమ్మ, డి. అశోక్, అనిల్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్‌పర్సన్‌పై దాడి దారుణం



మాట్లాడుతున్న హరిశ్చంద్ర గుప్తా

జనగామ: అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ బి.అరుణపై రైతులు దాడికి పాల్పడడం దారుణమని జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మహంకాళి హరిశ్చంద్ర గుప్తా అన్నారు. మంగళవారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదు గులను ఓర్వలేని కొంతమంది ఇటువంటి చిల్లర రాజకీయాలకు ఉసిగొలుపు తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాల్లో తమకంటూ ఓ ప్రత్యేక స్థానంలో ఉండాలనే హక్కు ఆర్యవైశ్యులకు ఉందన్నారు. పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర, తూకంలో మోసం జరిగితే మార్కెట్ కార్యదర్శి లేదా చైర్‌పర్సన్‌కు ఫిర్యాదు చేయాలే తప్ప, ఇలాంటి దాడులకు పాల్పడడం హేయమైన చర్య అన్నారు. ఏకంగా మహిళా చైర్‌పర్సన్‌ను రైతులు కొడుతూ బయటకు తీసుకురావడం ఏంటని, దీని పై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి, బాధ్యులను వెంటనే అరెస్ట్ చేసి చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా సర్కారు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీల ఎన్నిక



ఎన్నికైన గ్రామ కమిటీ సభ్యులు

బచ్చన్నపేట: మండలంలోని భోనకొల్లూర్, కేసిరెడ్డిపల్లి, కొడవటూర్, బసిరెడ్డిపల్లిల్లో పార్టీ నూతన గ్రామకమిటీలను ఎన్నుకున్నట్లు మండల సమన్వయ కమిటీ కోఆర్డినేటర్ అల్వాల ఎల్లయ్య తెలిపారు. మంగళవారం కమిటీలను ఎన్నుకున్న అనంతరం ఆయన మాట్లాడారు. గ్రామ కమిటీల అధ్యక్షులుగా బోదాసు స్వామి, బాల్నె రమేష్, మల్లం శ్రీనివాస్, బాలగోని కనుకయ్య, ప్రధాన కార్యదర్శులుగా బోదాసు శేఖర్, పాకాల చిరంజీవి, ఇమ్మడి దర్శన్‌రెడ్డి, ఎద్దు ఆంజనేయులు, యూత్ అధ్యక్షులుగా దయ్యాల నరేష్, మిన్నాలపురం బాలసిద్దులు, రహీంఖాన్, ఎద్దు పవన్, కార్యదర్శులుగా పాక అంజయ్య, భువనగిరి భానుప్రసాద్, తాళ్లపల్లి సందీప్, ఎంబరి శివకుమార్, మహిళా అధ్యక్షులుగా చేర్యాల సౌమ్య, నీల కవిత, బాలగోని శిరీషతోపాటు సభ్యులను ఎన్నుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నూకల బాల్‌రెడ్డి, హరిబాబుగౌడ్, వేణు వందన, జంగిలి స్వామి, గాలి కృష్ణ, గంగం బుచ్చిరెడ్డి, విద్యానాథ్, మహిపాల్‌రెడ్డి భాస్కర్ పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

చిల్పూరు: చిన్నపెండ్యాల ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచి బహుమతులు గెలుపొందినట్లు హెచ్ఎం సంపత్, పీఈటీ వంశీ తెలిపారు. సోమవారం నల్లగొండ జిల్లా వేదికగా జరిగిన రాష్ట్రస్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీలల్లో ముగ్గురు విద్యార్థులు పాల్గొన్నారు. అర్చన (ప్రథమ), సౌమ్య (ద్వితీయ) అంకిత నాల్గో స్థానంలో నిలిచి బహుమతులను అందుకున్నట్లు చెప్పారు.

భక్త మార్కండేయ బ్రహ్మోత్సవాలు



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న నిర్వాహకులు



కొమ్మూరికి స్వామివారి ఫొటోను బహూకరిస్తూ..

జనగామ: పట్టణం 12వ వార్డులోని భక్త మార్కండేయ ఆలయంలో మంగళవారం ద్వితీయ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు ఘనంగా జరిగాయి. వేడుకలకు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అర్చకులు, ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే పల్లాకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంత లభిస్తుందని అన్నారు. అనంతరం కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు.

కొమ్మూరి పూజలు..

పట్టణంలోని వీవర్స్ కాలనీలోని భక్త మార్కండేయ స్వామి ద్వితీయ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలకు డీసీసీ అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కాగా, కొమ్మూరికి స్వామివారి ఫొటోను అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉన్నారు.

అల్పాహారం బిల్లులు చెల్లించాలి



వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

జనగామ రూరల్: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్న కార్మికులకు 5నెలల బిల్లులు వెంటనే చెల్లించాలని బీఆర్ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వేముల నర్సింగం కోరారు. ఈ మేరకు మంగళవారం అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌కు వినతిపత్రం అదజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎండీ ఖలీదా బేగం, కళావతి, నాగమ్మ, మంజుల, యాదమ్మ, సువర్ణ, రేణుక, సోమలక్ష్మి, యాదమ్మ పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి అందజేత



పరీక్ష ప్యాడ్లతో విద్యార్థులు

దేవరుప్పుల: మండలంలోని కడవెండి జెడ్పీఎస్ఎస్ లోని 100 మంది విద్యార్థులకు లక్ష్మీట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం చైర్మన్ మామిడాల మల్లేష్ పరీక్ష ప్యాడ్లు, సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటి నుంచే పట్టుదలతో చదువుకుంటే భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదుగుతారని అన్నారు. కార్యక్రమంలో ట్రస్టు వైస్ చైర్మన్ శాగబోయిన పాపారావు, హెచ్ఎం పి.వెంకన్న, ప్రభాకర్, ఇందిర, సురేందర్, సునీత, శ్రీనివాస్, నీల తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ సేనా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో..

సేవాలాల్ జయంతి పురస్కరించుకొని మండలంలోని కోలుకొండ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సేవాలాల్ సేనా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పరీక్షా ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అనిల్ చౌహాన్, ప్రధానోపాధ్యాయుడు రాజిరెడ్డి, అనిల్ బిక్కోజి తదితరులు పాల్గొన్నారు.

మోదీతోనే సుస్థిర పాలన

రఘునాథపల్లి: ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం దేశంలో సుస్థిర పాలన అందిస్తుందని బీజేపీ రాష్ట్ర నాయకుడు కల్వగూరి ప్రభాకర్ అన్నారు. మంగళవారం మండలంలోని అశ్వరావుపల్లిలో గావ్ చలో బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా ఆయన పార్టీ నాయకులతో కలిసి గడప గడపకు వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ 400 సీట్లు సాధించి ప్రధాని నరేంద్రమోదీ మూడో సారి ప్రధాని కానున్నారని ఆయన పేర్కొన్నారు. దైతల రంజిత్‌గౌడ్, గుర్రం జంజి, వెంకటేష్, ముప్పిడి రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరి అరెస్ట్



మాట్లాడుతున్న సీఐ మహేందర్‌రెడ్డి

పాలకుర్తి : భూ తగాదా కేసులో మండలంలోని లక్ష్మీనారాయణపురం గ్రామానికి చెందిన మజ్జిగ యాదగిరి, వీరస్వామిలను అరెస్ట్ చేసినట్టు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లక్ష్మీనారాయణపురం గ్రామానికి చెందిన గుట్టి భిక్షపతిపై ఈనెల 12న యాదగిరి, వీరస్వామి వీరస్వామి గొడ్డలితో దాడి చేయగా భిక్షపతి బంధువు జోగు సాయికుమార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. విచారణ చేపట్టి నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్టు చెప్పారు. నిందితులపై రౌడీషీట్ తెరుస్తామన్నారు. నిందితులను అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనబర్చిన ఎస్సై సాయి ప్రసన్నకుమార్, కానిస్టేబుళ్లు రాజేందర్, నరేశ్‌లను సీఐ అభినందించారు.

నిరుపయోగ బావిలో అడవి పందులు

● కాపాడిన అటవీశాఖాధికారులు

రఘునాథపల్లి: మండలంలోని మేకలగట్టు శివారులో నిరుపయోగ బావిలో పడిన ఏడు అడవి పందులను అటవీశాఖాధికారులు కాపాడిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వేల్పుల లక్ష్మి వ్యవసాయ నిరుపయోగ బావిలో ప్రమాదవశాత్తు ఏడు అడవిపందులు పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించి అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. జనగామ ఎఫ్ఆర్ఓ కొండల్‌రెడ్డి, డీఆర్ఓ ఇజాజ్ అహ్మద్ సిబ్బందితో వెంటనే ఘటనా స్థలికి చేరుకొని స్థానిక యువకులు సంపత్, శ్రీను, సతీష్ సహకారంతో మూడు గంటల పాటు శ్రమించి వాటిని బయటకు తీశారు. ఆరు మగ, ఒక అడ అడవి పందులను పశు వైద్యుడితో పరీక్షలు జరుపగా ఆరోగ్యంగా ఉన్నట్లు గుర్తించి వాటిని రఘునాథపల్లి ఫారెస్ట్‌లో సురక్షితంగా వదిలినట్లు అటవీ అధికారులు తెలిపారు.

వీర సైనికుల దినోత్సవంగా జరుపుకోవాలి

జనగామ: ఏటా ఫిబ్రవరి 14వ తేదీన వీర సైనికుల త్యాగ దినోత్సవంగా జరుపుకోవాలని హిందూ సంస్కృతి పరిరక్షణ అధ్యక్షుడు సోమిరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన జిల్లా కేంద్రంలో మాట్లాడుతూ ప్రేమికుల వేడుకలను ఎవరినీ జరుపుకోనివ్వమన్నారు. ఎవరైనా ప్రేమికుల దినోత్సవం జరుపుకుంటే ఊరుకునే ప్రసక్తే లేదని, ఫిబ్రవరి 14న ప్రేమ వేడుకలను ఒప్పుకునే ప్రసక్తే లేదన్నారు. ఈ రోజు పుల్వామా ఘటనలో మరణించిన సీఆర్పీఎఫ్ వీర సైనికుల త్యాగ దినంగా జరుపుకుని, అమర వీరులకు నివాళులర్పించాలన్నారు.

చర్యలు తీసుకోవాలి

దేవరుప్పుల: ఇసుక అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకులు, గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. మండలంలోని కామారెడ్డి గూడెం గ్రామంలోని వాగు నుంచి ప్రతిరోజు వందల ట్రిప్పులు ఇసుకను డంపింగ్ చేసుకుని చుట్టుపక్కల గ్రామాల్లోకి రాత్రి వేళల్లో తరలించడం జరుగుతుందని తెలిపారు. తక్షణం అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. పుల్లయ్య, సురేష్, నిఖిల్, కిషన్, నాగిరెడ్డి, నర్సిరెడి పాల్గొన్నారు.

ఎంఈఓపై ఆర్జేడీ చర్యలు

రెండు ఇంక్రిమెంట్లు కట్ : డీటీఎఫ్

జనగామ రూరల్ : నర్మెట ఎంఈఓపై ఆర్జేడీ చర్యలు తీసుకున్నట్లు డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఇప్ప రాంరెడ్డి, వి.దివాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఎంఈఓకు రెండు ఇంక్రిమెంట్లు కట్ చేశారని పేర్కొన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు విధులకు హాజరు కాని కాలానికి సైతం ఎంఈఓ వేతనం చెల్లించడంపై డీటీఎఫ్ నాయకులు ఆర్జేడీకి ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ క్రమంలో అధికారులు విచారణ చేపట్టి వాస్తవాలను నివేదించడంతో ఎంఈఓపై క్రమశిక్షణ చర్యల కింద రెండు ఇంక్రిమెంట్లు కట్ చేశారని వివరించారు.

జేఈఈ మెయిన్‌లో ‘ఏబీవీ’ విజయకేతనం

జనగామ రూరల్: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో పట్టణంలోని ఏబీవీ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని కళాశాల ప్రిన్సిపాల్ కె.కనకరాజు మంగళవారం తెలిపారు. కళాశాల నుంచి 65 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 75 శాతం మంది క్వాలీఫై అయ్యారని, ఇందులో 8 మందికి ప్రముఖ ఎన్ఐటీలో ప్రవేశం పొందే అవకాశం ఉందని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



రఘునాథపల్లి: మండల కేంద్రంలోని స్టేషన్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పోషక ఆహార లోపాలపై స్థానికులు జిల్లా కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పీహెచ్‌సీ వైద్యులు మంగళవారం పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. తహసీల్దార్ పురం యుగేందర్ సమక్షంలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. మండల వైద్యాధికారి కమల్‌హసన్, డాక్టర్ రవితేజ, డాక్టర్ శ్రీవాణి, సూపర్‌వైజర్లు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

మినీ వాటర్ ప్లాంట్ ఏర్పాటు



పాలకుర్తి: మండలంలోని గూడూరులో గిరిజన బాలికల గురుకుల విద్యాలయంలో చుక్కా రామయ్య ఫౌండేషన్ సహకారంతో మినీ వాటర్ ప్లాంట్‌ను మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు మాచర్ల పుల్లయ్య మాట్లాడుతూ విద్యార్థినులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

స్వయంపాలన దినోత్సవం

జఫర్‌గఢ్: మండలంలోని కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్వయంపాలన దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం కాంప్లెక్స్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ బావండ్ల నాగజ్యోతి మంగళవారం ప్రారంభించారు. ఎంపీడీఓ రఘురామకృష్ణ, ఎంపీటీసీ ఫోరం మండల అధ్యక్షుడు దూడల కనుకయ్య, ఎంపీటీసీ అరుణఅయిలయ్య పాల్గొన్నారు.


క్యాలెండర్ ఆవిష్కరణ

జఫర్‌గఢ్: తెలంగాణ మోడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు రేచవేణి కిరణ్‌కుమార్ ఉపాధ్యాయులతో కలసి నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ శ్రీకాంత్, సంఘం రాష్ట్ర బాధ్యులు జానీనాయక్, మహేందర్ పాల్గొన్నారు.

మండలాన్ని హనుమకొండ జిల్లాలో కలపాలి

జఫర్‌గఢ్: జఫర్‌గఢ్ మండలాన్ని హనుమకొండ జిల్లాలో కలుపాలని మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కోరారు. ఈ మేరకు స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిరకు పార్టీ కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు.

జాతర పనులు త్వరగా పూర్తి చేయాలి



స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఇప్పగూడెం, రంగరాయగూడెం, కోమటిగూడెం, అక్కపెల్లిగూడెం గ్రామాల పరిధిలోని సమ్మక్క–సారలమ్మ జాతర పనులను త్వరగా పూర్తి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి మునిగెల రమేష్ డిమాండ్ చేశారు. చింతగట్టు సమ్మక్క–సారలమ్మ జాతర ప్రాంగణాన్ని సీపీఎం మండల నాయకులతో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరకు సమయం దగ్గర పడుతున్నా పనులు ఇంకా నత్తనడకన సాగుతున్నాయని, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. భక్తుల కోసం తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్య, రోడ్లు తదితర సౌకర్యాలను అధికారులు, సంబంధిత జాతరకమిటీ త్వరితగతిన చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు కొడెపాక యాకయ్య, గట్ల మల్లారెడ్డి, మంద ఇలిషన్, ఏదునూరి యాకయ్య, కత్తుల రాజు, కుర్ర ఉప్పలయ్య, పరమేష్ పాల్గొన్నారు.

నియామకం

రఘునాథపల్లి: మండలంలోని భానాజీపేట గ్రామానికి చెందిన కొమ్మగళ్ల రాకేష్ ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడిగా నియామకం అయ్యారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర చేతుల మీదుగా రాకేష్ నియామకపు ప్రతిని అందుకున్నారు.

అష్టదళ పాద పద్మారాధన

చిల్పూరు: చిల్పూరుగుట్ట బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో మంగళవారం భక్తుల నడుమ బంగారు పుష్పాలతో అష్టదళ పాద పద్మారాధన పూజ ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో భక్తుల సమక్షంలో 108 బంగారు పుష్పాలు, వెండి పాదపద్మాలతో అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ స్వామివారికి పూజలు చేశారు.

సంతాప సభ

చిల్పూరు: ఇటీవల మృతి చెందిన మాజీ సర్పంచ్ తాళ్లపల్లి వెంకటయ్య సంతాపసభను మండలంలోని చిన్నపెండ్యాలలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ గ్రామానికి వెంకటయ్య చేసిన సేవలను కొనియాడారు. సంపత్, ఎంపీటీసీ ఉమసమ్మయ్య, అంబేద్కర్ యువజన సంఘాల రాష్ట్ర కోఆర్డినేటర్ సుదర్శన్ ఉన్నారు.